ఖిలావరంగల్: వరంగల్ కలెక్టరేట్‌లో జాతీయ జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ సత్యశారద, అధికారులు

వరంగల్ చౌరస్తా: ఎంజీఎం హాస్పిటల్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్‌కుమార్

వరంగల్ చౌరస్తా: కాళోజీ హెల్త్ యూనివర్సిటీలో జాతీయజెండా ఆవిష్కరిస్తున్న వీసీ డాక్టర్ నందకుమార్‌రెడ్డి

పోచమ్మమైదాన్: గోపాలస్వామి గుడి కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

సంబురంగా..

- ఖుష్‌మహల్ మైదానంలో జిల్లా స్థాయి తెలంగాణ ఆవిర్భావ వేడుకలు
- జాతీయ జెండా ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి
- జిల్లా వ్యాప్తంగా వేడుకలు

నమస్తే, నెట్‌వర్క్: తెలంగాణ ఆవిర్భావ వేడుకలు సోమవారం జిల్లా వ్యాప్తంగా సంబురంగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు జాతీయ జెండా ఆవిష్కరించారు. నగరంలోని రంగశాయిపేటలోని బీఆర్ఎస్ వరంగల్ జిల్లా కార్యాలయం ఆవరణలో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ జాతీయ జెండా, బీఆర్ఎస్ జెండా ఎగురవేశారు. మామునూరులోని పీటీసీలో ప్రిన్సిపాల్ పూజ జాతీయజెండా ఎగురవేశారు. వరంగల్ కలెక్టరేట్‌లో కలెక్టర్ సత్యశారద త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, ఏవో విశ్వప్రసాద్ పాల్గొన్నారు. జడ్పీ హాల్‌లో జడ్పీ సీఈవో రాంరెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించారు.

ఖుష్‌మహల్ మైదానంలో..

ఖిలావరంగల్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు సోమవారం ఖిలావరంగల్ ఖుష్‌మహల్ మైదానంలో వైభవంగా జరిగాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పడమరకోటలోని అమరవీరుల స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మధ్యకోటలోని ఖుష్‌మహల్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ నగర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.4,962కోట్లు కేటాయించిందన్నారు. 2040 వరకు జనాభా పెరుగుదలకు అనుగుణంగా వరంగల్ మాస్టర్ ప్లాన్ తీసుకువచ్చినట్లు తెలిపారు. మామునూరు ఎయిర్‌పోర్టు కల త్వరలో సాకారం కాబోతోందన్నారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనులు వేగవంతం చేశామని, నర్సంపేటలోని మెడికల్ కాలేజీ, హాస్పిటల్ కార్యకలాపాలు ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. వరంగల్ పాత బస్‌స్టేషన్ స్థానంలో అధునాతన సౌకర్యాలతో కొత్త బస్టాండు వేగంగా పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. రూ.80కోట్లతో వరంగల్‌లో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనం పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. గ్రీన్ హెరిటేజ్ పాకాల బయోడైవర్సిటీ పార్కు, భద్రకాళి ఆలయం చుట్టూ మాడవీధులు, రాజగోపురాలు, భద్రకాళి చెరువుకట్ట నిర్మించాలని నిర్ణయించగా 382 ఎకరాల్లో విస్తరించి ఉన్న భద్రకాళి చెరువు పూడికతీత పనుల్లో వేగం పెరిగిందన్నారు. బ్యాంకు లింకేజి కింద 7933 స్వశక్తి మహిళా సంఘాలకు లక్ష్యానికి మించి రూ.475 కోట్ల రుణాలు మంజూరు చేసి రికవరీ చేసినందుకు గాను వరంగల్ జిల్లాకు రాష్ట్ర స్థాయి అవార్డు లభించినందుకు అభినందనలు తెలిపారు. కలెక్టర్ డాక్టర్ సత్యశారద, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, శ్రీపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, డీసీపీ అంకిత్‌కుమార్, స్థానిక కార్పొరేటర్ బైరబోయిన ఉమతో కలిసి తెలంగాణ అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా తెలంగాణ సంస్కృతి, దేశభక్తి ఉట్టిపడేలా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరింపజేశాయి. ప్రభుత్వ శాఖల శకటాలు ఆకట్టుకున్నాయి. అనంతరం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు.

చెన్నారావుపేట: పీఏసీఎస్ ఆవరణలో జెండా ఆవిష్కరిస్తున్న చైర్మన్ చింతకింది వంశీ

పడమర కోటలో తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి పొంగులేటి, కలెక్టర్, ఎమ్మెల్యేలు

పోచమ్మమైదాన్: దేశాయిపేట నీకేఎం కళాశాలలో మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ధర్మారెడ్డి


కాశీబుగ్గ: చాంబర్ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ

బల్దియాలో..

వరంగల్: బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలో తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో ఉదయం 8గంటలకు మేయర్ గుండు సుధారాణి జాతీయజెండా ఎగురవేశారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2 నుంచి సెప్టెంబర్ 9 వరకు నిర్వహించే వంద రోజుల ప్రణాళికా ర్యాలీని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ఆమె ర్యాలీని ప్రారంభించారు. వంద రోజుల ప్రణాళికపై ప్రతిజ్ఞ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రాణత్యాగాలు చేసిన అమరులకు నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.4,170కోట్లు మంజూరు చేసిందన్నారు. ఇప్పటికే యుజీడీపై డీపీఆర్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ గ్రేటర్ పరిధిలో 8,075 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, వారికి ప్రొసీడింగ్‌లను అందజేస్తున్నట్లు తెలిపారు. కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ వంద రోజుల ప్రణాళికలో బల్దియా విభాగాల వారీగా చేపట్టాల్సిన పనులను పక్కాగా అమలు చేస్తామన్నారు. బల్దియా సిబ్బందికి పీపీఈ కిట్లను అందజేశారు. డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, కార్పొరేటర్లు మరుపల్ల రవి, నల్లా స్వరూపారాణి, దిడ్డి కుమారస్వామి, వేముల శ్రీనివాస్, దేవరకొండ విజయలక్ష్మి, గుండు చందన, సురేష్‌జోషి, కావటి కవిత, పల్లం పద్మ, అరుణ, బైరబోయిన ఉమ, చింతాకుల అనిల్‌కుమార్, బాల్నే సురేష్, విజయశ్రీ రజాలీ, జక్కుల రవిందర్ యాదవ్ పాల్గొన్నారు. కాగా, వంద రోజుల ప్రణాళికా ర్యాలీని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. బల్దియా ప్రధాన కార్యాలయం నుంచి కేఎంసీ వరకు ప్ల కార్డులు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు.

ప్రతిజ్ఞ చేస్తున్న మేయర్ సుధారాణి, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

రాయపర్తి: మండల పరిషత్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో కిషన్‌నాయక్

నల్లబెల్లి: జాతీయ జెండాకు వందనం చేస్తున్న జడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న, బీఆర్ఎస్ నాయకులు

చెన్నారావుపేట: పోలీస్ స్టేషన్‌లో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న పోలీసులు

ఖానాపురం: జెండా ఎగురవేస్తున్న ఎంపీడీఓ సునీల్ రాజ్‌కుమార్

పర్వతగిరి: జాతీయ జెండా ఆవిష్కరణ చేస్తున్న మండల ప్రత్యేకాధికారి నీరజ

వరంగల్ చౌరస్తా: ఐఎంఏ భవన్‌లో జెండాకు వందనం

కలిమాబాద్: జాతీయజెండాకు వందనం పీటీసీ ప్రిన్సిపాల్ పూజ, పీటీసీ సిబ్బంది

వరంగల్ చౌరస్తా: కాకతీయ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆవరణలో..

దుగ్గొండి: పోలీస్ స్టేషన్‌లో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న సీఐ సాయిరమణ

నల్లబెల్లి: జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ ముప్పు కృష్ణ

గీసుగొండ: జెండాను ఆవిష్కరిస్తున్న ప్రత్యేక అధికారి సురేశ్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, జూన్ 2: వరంగల్ టౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వరంగల్ టౌన్ ఆపరేషన్ డీఈ ఎస్ మల్లికార్జున్ ఓ ప్రకటనలో తెలిపారు. మెయింటెనెన్స్ పనుల్లో భాగంగా వరంగల్‌లో ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు రథమ్, పెట్రోల్ పంప్, బందెల్లిశెట్టి, నిజాంపుర, మండిబజార్, జీఆర్ గుట్ట, లక్ష్మిపుర్, గిర్మాజిపేట, ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

బంధువుల ఇంటికి వెళ్లి వచ్చేసరికి..

కొడ్తిమాట్‌తండాలో చోరీ.. రూ.లక్ష అపహరణ

ఖానాపురం, జూన్ 2: బంధువుల ఇంటికి వెళ్లివచ్చేసరికి గుర్తుతెలియని వ్యక్తులు ఇంటితాళాలు పగులగొట్టి రూ.లక్ష అపహరించిన ఘటన ఆదివారం రాత్రి మండలంలోని కొడ్తిమాట్‌తండాలో జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన లావుడ్య చంద్రు – కాంతమ్మ దంపతులు ఆదివారం ఇంటికి తాళం వేసి ఖానాపురంలోని బంధువుల ఇంటికి వచ్చారు. రాత్రి 11గంటలకు తమ ఇంటికి వెళ్లారు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండగా లోపలికి వెళ్లి చూడగా ఇటీవల ధాన్యం అమ్మగా వచ్చిన రూ.లక్ష అపహరణకు గురైనట్లు గుర్తించారు. సోమవారం ఫిర్యాదు చేయగా పోలీసులు క్లూస్‌టీమ్‌తో చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు.

మామిడి చెట్టు పైనుంచి పడి మహిళ మృతి

వర్ధన్నపేట, జూన్ 2: మామిడి చెట్టు ఎక్కి కాయలు తెంపుతుండగా కాలుజారి కిందపడి రామవరం గ్రామానికి చెందిన ఓ మహిళ సోమవారం మృతిచెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటబోయిన సరోజన(55) సోమవారం సంగెం మండలం లోహిత గ్రామ సమీపంలోని మామిడితోటలో కాయలు తెంపేందుకు కూలికి వెళ్లింది. చెట్టు ఎక్కి కాయలు తెంపుతుండగా కాలుజారి కింద పడిపోయింది. దీంతో ఆమెకు బలమైన గాయాలు కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నది. తోటి కూలీలు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అవినీతి నిర్మూలనే ధ్యేయం

ఖానాపురం, జూన్ 2: సమాజంలో అవినీతి నిర్మూలనే ధ్యేయమని అవినీతి నిర్మూలన సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పుల్లూరి కుమారస్వామి అన్నారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో అవినీతి నిర్మూలన సంస్థకు చెందిన పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు సరైన అవగాహన లేక మోసాలకు గురవుతున్నారని తెలిపారు. అవినీతి నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. వేములపల్లి ప్రకాశ్‌రావు, బత్తిని శ్రీనివాస్ గౌడ్, వెంకట్రాంనర్సయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

గీసుగొండ, జూన్ 2 : మండలంలోని మనుగొండకు చెందిన కూనమల్ల సుదర్శన్‌కు ఇటీవల గుండె ఆపరేషన్ జరిగింది. ఈవిషయం తెలుసుకున్న 1989-90లో అతడితో పదోతరగతి కలిసి చదువుకున్న స్నేహితులు సోమవారం పరామర్శించి రూ.25వేల ఆర్థికసాయం అందజేశారు. స్నేహితులు రవీందర్, రాజు, మురళి, రాజిరెడ్డి శ్రీనివాస్, సదానందం, సంతోశ్, వెంకన్న, శ్రీనివాస్, ప్రబాకర్, మల్లేశం పాల్గొన్నారు.

మామిడి కాయలు పంచిన రైతు

ఖిలావరంగల్, జూన్ 2: మామిడి కాయలకు మార్కెట్‌లో కనీస ధర లేకపోవడంతో ఓ రైతు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డుపై బాటసారులకు ఉచితంగా పంచాడు. వర్ధన్నపేట మండలం ఇల్లందుకు చెందిన రైతు ఎల్లస్వామి మామిడికాయలను సోమవారం వాహనంలో పండ్ల మార్కెటకు తీసుకువచ్చాడు. వ్యాపారులు గిట్టుబాటు ధర పెట్టకపోగా, సుమారు రెండు క్వింటాళ్లు రూ.వెయ్యికి ఇవ్వాలని అడిగారు. దీంతో వరంగల్ రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో వాహనం నిలిపి బాటసారులకు పంపిణీ చేశాడు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

వరంగల్‌చౌరస్తా, జూన్ 2: ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని వరంగల్ ఏసీపీ నందిరాం సూచించారు. సోమవారం ఏసీపీ కార్యాయంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవధ విషయంలో ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా మంచి వాతావరణంలో పండుగ జరుపుకోవాలన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జిల్లా విద్యార్థుల హవా

గిర్మాజీపేట, జూన్ 2: ప్రతిష్టాత్మక ఐఐటీల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 ఫలితాలు సోమవారం ప్రకటించగా ట్రైబల్ వెల్ఫేర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు డిప్యూటీ సెక్రటరీ డీఎస్ వెంకన్న తెలిపారు. యూకూబ్‌పుర ట్రైబల్ వెల్ఫేర్ కళాశాల విద్యార్థి భూక్యా రాహుల్ ఆలిండియా 124వ ర్యాంక్, గిరిజన గురుకుల బాలుర విభాగంలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించినట్లు పేర్కొన్నారు. కే వంశీకుమార్ 1,689వ ర్యాంకు, ఎం ఈశ్వర్ 2,066వ ర్యాంక్ సాధించారని వివరించారు. ఎం వినయ్‌కుమార్, భూక్యా వీరన్న, మాలోత్ రాకేశ్ ప్రిపరేటరీ ఐఐటీ ర్యాంకులు సాధించారని వివరించారు.

అశోక్‌నగర్ సైనిక్‌స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ఖానాపురం: మండలంలోని అశోక్‌నగర్ సైనిక్‌స్కూల్‌కు చెందిన ఆరుగురు ఇంటర్ విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ గట్ల సురేందర్ తెలిపారు. ఎం.సతిరాం 1,221, బీ కార్తీక్ 1,802 ర్యాంకులు సాధించి నేరుగా ఐఐటీల్లో సీట్లు పొందే అర్హత సాధించారని పేర్కొన్నారు. అదేవిధంగా బీ బాలకృష్ణ 7, ఎస్ మహేశ్ 679, కే విష్ణు 930, డీ రాజ్‌కుమార్ 2012 ప్రిపరేటరీ ర్యాంకులు సాధించి ఐఐటీల్లో ఐదేళ్ల కోర్సుల్లో చేరే అర్హత సాధించినట్లు వెల్లడించారు. గిరిజన గురుకులాల సెక్రటరీ సీతాలక్ష్మి, అడిషనల్ సెక్రటరీ మాధవి, లత, డిప్యూటీ సెక్రటరీ వెంకన్న, నటరాజన్ అభినందించారు.

రాహుల్ వంశీకుమార్ ఈశ్వర్
సతిరాం కార్తీక్ బాలకృష్ణ
మహేశ్ విష్ణు రాజ్‌కుమార్

నేటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

ఖానాపురం/ రాయపర్తి/ పోచమ్మమైదాన్, జూన్ 2: జిల్లాలో మంగళవారం నుంచి భూ భారతి రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నారు. రైతులు, భూపట్టాదారులు తమ సమస్యలపై తగిన ఆధారాలతో లిఖితపూర్వకంగా దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిశీలించి పరిష్కరించనున్నారు. ఖానాపురం మండలంలో 3న రంగాపురం, మాటువీరారం, 4న రాగంపేట, కొత్తూరు, 5న ఐనపల్లి, 6న దబీర్‌పేట, మంగళవారిపేట, 9న పాకాల అశోక్‌నగర్, జాలుబంధం, 10న తుంగబంధం, 11న ఖానాపురం, 12న పోచారం, బుధరావుపేట, 13న ధర్మరావుపేటలో ఉంటాయని డిప్యూటీ తహసీల్దార్ రాజా రేణుక వివరించారు. రాయపర్తి మండలంలో 3న గన్నారం, తిర్మలాయపల్లి, 4న కొండూరు, బురహాన్‌పల్లి, 5న కేశవాపురం, కొలన్‌పల్లి, 6న గట్టికల్, ఊకల్, 9న మొరిపిరాల, మైలారం, 10న పెర్కవేడు, కొత్తూరు, 11న పోతిరెడ్డిపల్లి, కాట్రపల్లి, 12న సన్నూరు, జగన్నాథపల్లి, 13న సన్నూరు, కొండాపురం, 16, 17 తేదీల్లో రాయపర్తిలో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ముల్కనూరి శ్రీనివాస్ తెలిపారు. 3న మట్టెవాడ గ్రామానికి ములుగు రోడ్డులోని ఐశ్వర్య గార్డెన్, 4న ఏనుమాముల, 5న పైడిపల్లి, దేశాయిపేట కలిపి పైడిపల్లి, 6న కొత్తపేటలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు వరంగల్ మండల తహసీల్దార్ ఎండీ ఇక్బాల్ తెలిపారు.

హాస్పిటల్‌లో సమస్యలను పరిష్కరించాలి

వరంగల్ చౌరస్తా, మే 2: కాకతీయ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీపీఐ హనుమకొండ జిల్లా సమితి ప్రతినిధుల బృందం డిప్యూటీ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం హాస్పిటల్ సందర్శించిన సమితి బృంద సభ్యులు హాస్పిటల్ ఆవరణ, రోగుల సమస్యలు, వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ బాలరాజు, ఆర్ఎంఓ డాక్టర్ దీపక్‌రెడ్డికి వినతిపత్రాలు అందజేశారు. సెంట్రల్ ఏసీ పనిచేయకపోవడంతో మేజర్ ఆపరేషన్లు నిలిచాయని, వెంటనే శస్త్రచికిత్సలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని, ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఎల్లేశ్, సారంగపాణి, భిక్షపతి, రాజు, రాజ్‌కుమార్, నరసయ్య, చంద్రమౌళి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలి

గిర్మాజీపేట, జూన్ 2: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని డీఈవో మామిడి జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో జిల్లా విద్యాశాఖ, కాలుష్య నివారణ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 4 నుంచి పదో తరగతి విద్యార్థులకు ప్లాస్టిక్ కాలుష్యాన్ని అధిగమించేందుకు వ్యూహాలపై వ్యాసరచన, ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేద్దాం అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు బుధవారం ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు మట్టెవాడ ఉన్నతపాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనే విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే మట్టెవాడ ఉన్నత పాఠశాలకు చేరుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్ 9848878455 నంబర్‌కు సంప్రదించాలని డీఈవో సూచించారు.

ల్యాబర్తిలో ఆర్మీ జవాన్‌కు సత్కారం

వర్ధన్నపేట, జూన్ 2: భారత ప్రభుత్వం 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాలపై చేసిన యుద్ధంలో పాల్గొని వచ్చిన ఆర్మీ జవాన్ భూక్యా బాలాజీని మండలంలోని ల్యాబర్తి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రముఖులు సోమవారం ఘనంగా సత్కరించారు. ల్యాబర్తి పాఠశాలలో చదువుకున్న టేకులతండాకు చెందిన పూర్వ విద్యార్థి బాలాజీ ఆర్మీలో జవాన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. 'ఆపరేషన్ సిందూర్'లో పాల్గొని ఇటీవల రాగా, పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అతడిని ఘనంగా సత్కరించారు. పాఠశాల విద్యార్థులు, యువకులు బాలాజీని స్ఫూర్తిగా తీసుకొని దేశసేవ కోసం పనిచేయాలని ప్రధానోపాధ్యాయుడు వేణుకుమార్ సూచించారు. ఆప్ చైర్మన్ సునీత, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, హరిలాల్, వెంకటస్వామి, మాధురి, రఘువీర్, శివకుమార్, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

ల్యాబర్తి పాఠశాలలో ఆర్మీ జవాన్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

పీఏసీఎస్ కొత్త చైర్మన్‌కు ఘన సన్మానం

చెన్నారావుపేట, జూన్ 2: స్థానిక పీఏసీఎస్ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణ రెడ్డి ఇటీవల గుండెపోటుతో మరణించగా, కొత్త చైర్మన్‌గా చింతకింది వంశీ ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. దీంతో బీఆర్ఎస్ నాయకుడు బాల్నె వెంకన్న ఆధ్వర్యంలో సోమవారం ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానించారు. బీఆర్ఎస్ తిమ్మరాయిన్‌పహాడ్ నాయకుడు కొండవీటి ప్రదీప్‌కుమార్ కూడా శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు పత్తినాయక్, కంది కృష్ణచైతన్యరెడ్డి, కుండె మల్లయ్య, అనుముల కుమారస్వామి, తూటి శ్రీనివాస్, జున్నుతుల మహేందర్‌రెడ్డి, హంస విజయరామరాజు పాల్గొన్నారు.

పీఏసీఎస్ కొత్త చైర్మన్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రెండు నెలలుగా నిర్లక్ష్యం

- కూలిన స్తంభాన్ని సరిచేయని అధికారులు
- వ్యవసాయ భూమి దున్నుకోని రైతు

దుగ్గొండి, జూన్ 2: మండలంలోని నాచినపల్లిలో రెండు నెలల క్రితం కూలిన కరెంట్ స్తంభాన్ని విద్యుత్ అధికారులు సరిచేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. రైతు యారరాజుకు చెందిన వ్యవసాయ భూమిలో కరెంట్ స్తంభం రెండు నెలల క్రితం గాలి దుమారానికి నేలకొరిగింది. విద్యుత్ అధికారులకు తెలియజేయగా ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కరెంట్ వైర్లను కట్‌చేసి వెళ్లిపోయారు. ట్రాక్టర్‌తో భూమి దున్నేందుకు స్తంభం, వైర్లు అడ్డుగా ఉన్నాయని, సరిచేయాలని అధికారులను కోరినా పట్టించుకోవడంలేదని సదరు రైతు వాపోయాడు. ఖరీఫ్ వ్యవసాయ పనుల సీజన్ ప్రారంభమైనందున వెంటనే స్పందించి సరిచేయాలని కోరాడు.

విద్యుత్ స్తంభాన్ని చూపుతున్న రైతు

కడారిగూడెంలో గంజాయి కలకలం

ముగ్గురిని అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

వర్ధన్నపేట, జూన్ 2: మండలంలోని కడారిగూడెంలో సోమవారం గంజాయి కలకలం రేగింది. గ్రామానికి చెందిన యువకుడు మంద థామస్(28) హైదరాబాద్ ప్రాంతం నుంచి సుమారు కిలో గంజాయి తీసుకువచ్చి పలువురికి విక్రయిస్తున్నట్లు సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. అక్కడ గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. ఇందులో యువకుడు థామస్ గంజాయి తీసుకువచ్చినట్లు గుర్తించారు. వారి వద్ద లభించిన గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులతోపాటు గంజాయి స్థానిక ఎస్సైకి అప్పగించారు. ఎస్సై రాజు విచారణ జరుపుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పర్యాటక శాఖ గైడ్‌లను రెగ్యులరైజ్ చేయాలి

ఖిలావరంగల్, జూన్ 2: తెలంగాణ పర్యాటక శాఖ సైట్ గైడ్‌ల వేతనాలు పెంచి రెగ్యులరైజేషన్ చేయాలని కోరుతూ గైడ్ రవియాదవ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో టూరిజం శాఖలో రూ.600 వేతనంతో మొదలై స్వరాష్ట్రంలో రూ.3,900 వేతనం ఇస్తున్నారని పేర్కొన్నారు. 19 ఏళ్లుగా దేశ, విదేశాల పర్యాటకులకు సేవలందిస్తున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

చిరుధాన్యాల సాగుతో ఆర్థిక ప్రగతి

చిరుధాన్యాల సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కన్నబాబు

వర్ధన్నపేట, జూన్ 2: రైతులు వరి, వాణిజ్య పంటలే కాకుండా చిరుధాన్యాలు పండిస్తే ఆర్థిక ప్రగతి సాధిస్తారని భారతీయ చిరుధాన్యాల సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కన్నబాబు అన్నారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో మండలంలోని ల్యాబర్తి, వెంకట్రాంపుపల్లిలో చిరుధాన్యాలపై అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. ప్ర